క్లుప్తంగా

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్‌ఐ రామకృష్ణ



విస్సన్నపేట: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈనెల 4వ తేదీన మండలంలోని ప్రజలు ఎటువంటి అల్లర్లకు పాల్పడరాదని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. ఆదివారం ఎస్‌ఐ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు పోలీస్ సిబ్బందిని బందోబస్తు నిమిత్తం పంపించామన్నారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరుగకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, అటువంటివి జరిగితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి ఎస్‌ఐ పలు సూచనలు చేశారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంపునకు కృషి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ద్వారా సామాన్యులలో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందిస్తున్నామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. గేయానంద్ తెలిపారు. కొండపల్లిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లా కమిటీల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జేవీవీ నిర్మాణం, బలోపేతానికి అన్ని జిల్లాల కమిటీ అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు వివిధ రకాల నూతన కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ చర్చలు జరిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, గంగాధర్, కామేశ్వరరావు, జాన్‌బాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కుప్పా కృష్ణవేణి కళాబృందానికి చెందిన చైత్ర, పూర్వజ, శ్రీహాస, తన్వి, కావ్య, హేమశ్రీలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం, గులాబీతోటలో ఆదివారం త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. హిందూ జ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షుడు జగీరపు సురేష్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాలు తెలుసుకొనడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందన్నారు.

నేరస్తుడికి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు, సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ ఘటనలకు పాల్పడుతున్న పోతిరెడ్డి రంగారెడ్డి అలియాస్ కోటిరెడ్డి నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్ పేట పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన రంగారెడ్డి గతంలో పలు నేరాలకు పాల్పడి, అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లాడన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా మత్తు పదార్థాలు సేవించి నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలో నగరం నుంచి బహిష్కరించామన్నారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నామని తాజాగా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అభివృద్ధి పథంలో ఈదులగూడెం

- గత టీడీపీ పాలనలో నిరాదరణ
- ఎమ్మెల్యే ప్రతాప్ చొరవతో నిధుల మంజూరు
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్



రైతు భరోసా కేంద్రం

ఆగిరిపల్లి: మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గత టీడీపీ పాలనలో నిరాదరణకు గురై కనీస వసతులు కూడా లేని ఈదులగూడెం ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందింది. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఈదులగూడెం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

రూ.కోటి నిధులతో..

సచివాలయ వ్యవస్థ ద్వారా పేదలకు గ్రామంలో మెరుగైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈదులగూడెంలో రూ. కోటి నిధులతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని నిర్మించింది. గతంలో ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం పనులు మానుకుని మండల కేంద్రం ఆగిరిపల్లికి వెళ్లవలసి వచ్చేది. సచివాలయ వ్యవస్థ వచ్చాక గ్రామ పొలిమేర దాటకుండానే ఆయా ధ్రువీకరణ పత్రాలు అందుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు..

పేదల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గ్రామంలోని పాఠశాలల అభివృద్ధి చేపట్టింది. ఈ కార్యక్రమం కింద గ్రామంలోని జెడ్పీ, ఎంపీపీ పాఠశాలలకు రూ.53 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా పాఠశాలలో అదనపు తరగతి గదులు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, గ్రీన్ చాక్ బోర్డు, పెయింటింగ్స్ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు.



ఈదులగూడెంలో సచివాలయ భవనం

రూ.36 లక్షలతో సొసైటీ అభివృద్ధి

ఈదులగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమిత సంఘాన్ని అభివృద్ధి పరిచారు. రూ.36 లక్షలతో సొసైటీకి నూతనంగా క్యాష్ కౌంటర్ ఏర్పాటుతో పాటు, నూతన కార్యాలయం, గోడౌన్ ఏర్పాటు చేశారు.

ఐదేళ్లలో గ్రామస్తులకు రూ.25 కోట్ల లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాల కింద ఈదులగూడెం గ్రామానికి కోట్లాది రూపాయల లబ్ధి చేకూరింది. డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో రూ.25 కోట్ల లబ్ధి చేకూరిందని ఈదులగూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

148 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ..

ముఖ్యంగా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి 148 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఇళ్ల స్థలాల పంపిణీతోపాటు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని వారందరికీ ఇళ్లు కూడా మంజూరు చేయడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు కూడా చేసుకున్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో ఈ ఐదేళ్లలో తమ గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని ఈదులగూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే అప్పారావు చొరవతో..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రత్యేక చొరవతో ఈదులగూడెం గ్రామం ఇంతలా అభివృద్ధి చెందింది. అభివృద్ధి చేసే ప్రభుత్వానికి గ్రామస్తులంతా అండగా ఉంటాం.

– ఈలప్రోలు సుబ్బయ్య, సొసైటీ అధ్యక్షుడు

మునుపెన్నడూ లేని అభివృద్ధి



గత ప్రభుత్వాల హయాంలో గ్రామాన్ని పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మునుపెన్నడూ చూడని అభివృద్ధి జరిగింది. సచివాలయాల భవనాల నిర్మాణం, నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, సీసీ రోడ్లను నిర్మించారు.

– నందూరి భాస్కర్ ప్రసాద్, గ్రామస్తుడు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4న జూపూడి నిమ్రా, నోవా కళాశాలల్లో జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలు, కౌంటింగ్ ఏజెంట్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సీఐ ఎం. సత్యనారాయణ ఆదివార ఒక ప్రకటలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందున కౌంటింగ్ కేంద్రాల సమీప నివాస గృహాల్లో కొత్త వ్యక్తులకు చోటు కల్పించరాదన్నారు. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు తమ సెల్‌ఫోన్లు తీసుకురావద్దన్నారు. జగ్గయ్యపేట వైపు నుంచి వచ్చే ఏజెంట్లు కేతనకొండ వద్ద, మైలవరం వైపు నుంచి వచ్చే వారు ఎ.కాలనీ గ్రౌండ్, విజయవాడ వైపు వచ్చే వారు పవిత్ర సంగమం వద్ద తమ వాహనాలు పార్కింగ్ చేసుకుని అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో కౌంటింగ్ కేంద్రాలకు చేరాల్సి ఉందన్నారు. కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో 900 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ, పలువురు ఏసీపీలు నిరంతర పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హనుమాన్ చాలీసా పారాయణం



తిరువూరు: స్థానిక కోదండ రామాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం రాత్రి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పదకొండు సార్లు చాలీసా పారాయణ చేసిన అనంతరం ఆంజనేయస్వామికి విశేష నివేదనలు సమర్పించారు. ఉత్సవ మూర్తులకు తిరువంజనం, అష్టోత్తర శతనామాలతో అర్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం

- విత్తనాలు సిద్ధం చేసుకున్న అన్నదాతలు
- దుక్కులకు సమాయత్తమవుతున్న రైతులు
- పచ్చిరొట్ట సాగు ప్రారంభం



విస్సన్నపేటలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

తిరువూరు: రుతుపవనాల ఆగమనంతో తిరువూరు నియోజకవర్గంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు సకాలంలో పడితే ఈ సీజన్‌లో పంటల సాగు ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ పచ్చిరొట్ట సాగుకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీపై సరఫరా చేసింది. ప్రతి మండలంలో 10 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను గత వారం రోజులుగా ఆర్బీకేలలో విక్రయించారు. అపరాలు సాగు చేసే రైతుల కోసం పెసర, మినుము, కంది, కొర్ర, రాగి, నువ్వుల విత్తనాలను కూడా ఆర్బీకేలలో అందుబాటులో ఉంచారు.

దుక్కులు దున్నుతున్న రైతులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పంటల సాగుకు పొలాలను రైతులు సిద్ధం చేస్తున్నారు. తిరువూరు, విస్సన్నపేట వ్యవసాయ సబ్ డివిజన్లలో 40 వేల హెక్టార్లలో వరి, 35 వేల హెక్టార్లలో మిర్చి, పత్తి తదితర వాణిజ్య పంటలను సాగుచేస్తుండగా ఐదు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. గత జనవరిలో రబీ సాగుకు వర్షాభావ పరిస్థితులతో పాటు భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు పంటలు వేయలేకపోయారు. భూసారం పెంపునకు పలువురు రైతులు జీలుగలు, పిల్లిపెసర సాగుచేస్తున్నారు. వరి విత్తనాలలో ఎంటీయూ 1061, బీపీటీ 5204, ఎంటీయూ 1224 రకాలను సైతం ఆర్బీకేలలో అందుబాటులో ఉంచారు.

నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు

రైతులకు నాణ్యమైన విత్తనాలను సక్రమంగా అందించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. సీజన్ ప్రారంభంలోనే విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించడంతో పాటు దుకాణాలు తనిఖీ చేసి నాసిరకం విత్తనాలు, అనుమతి లేని కంపెనీల ఉత్పత్తులను విక్రయించవద్దని అధికారులు ఆదేశించారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు చేసేటపుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

చౌడు భూముల్లో పచ్చిరొట్ట సాగు ఉత్తమం



పంటల సాగుకు ముందు చౌడు భూముల్లో పచ్చిరొట్ట సాగు చేస్తే భూసారం పెరుగుతుంది. జీలుగ, పిల్లిపెసర విత్తనాలను ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై సరఫరా చేస్తున్నాం. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకువెళ్లి వీటిని పొందవచ్చు.

– పద్మ, వ్యవసాయాధికారి, తిరువూరు

జగన్‌కే మళ్లీ పట్టం కట్టనున్న ప్రజలు

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు



మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే రాష్ట్ర ప్రజలు మరోసారి పట్టం కట్టనున్నారని ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు అన్నారు. మైలవరంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. నిరుపేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి జగనన్న ప్రవేశ పెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న పథకాలే తిరిగి ఆయనను రెండో సారి అధికారంలోకి తీసుకురానున్నాయని చెప్పారు. మహిళలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. మహిళల అండ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సహకారంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ప్రణాళికాబద్ధంగా అభ్యర్థులను ఎంపిక చేసిన వైఎస్ జగన్ సిద్ధం సభలు నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాదరణను పొందారన్నారు. తన హయాంలో మీ ఇంట్లో మేలు జరిగిందనిపిస్తేనే ఓటు వేయండి అని దమ్ముగా, ధైర్యంగా చెప్పి ఓట్లు అడిగిన ధీరుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. విపక్ష నాయకులు అందుకు విరుద్ధంగా జగన్‌ను దుర్భాషలాడుతూ సభలు నిర్వహించారని గుర్తు చేశారు. రాజకీయాలలో విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన జగన్‌ను ప్రజలు మళ్లీ అధికారంలోకి తీసుకువస్తారని చెప్పారు.

పార్టీల కార్యాలయాల వద్ద బందోబస్తు



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

తిరువూరు: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ సందర్భంగా తిరువూరు నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల నివాసాల వద్ద, పార్టీల కార్యాలయాల వద్ద ఆదివారం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు కల్పించడంతో పాటు అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత ఏర్పాటు చేశారు.

ఎన్నికల నియమావళి పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురికి మించి ఒకేచోట గుమిగూడటం, బహిరంగ ప్రదేశాల్లో చర్చా వేదికలు నిర్వహించడం చట్టవిరుద్ధమని పోలీసులు మైకు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని లాడ్జీలు, కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాళ్లను తనిఖీ చేసిన పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశామని, సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుమతి లేకుండా సమావేశాలు, సభలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం నేరమని తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్..

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి ఎన్నికల నియమావళి వివరించారు. అనవసర వివాదాల్లో జోక్యం చేసుకున్నా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



తిరువూరు పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

రిటర్నింగ్ అధికారి భవానీశంకరి



సమావేశంలో మాట్లాడుతున్న భవానీశంకరి

నూజివీడు: ఈనెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీశంకరి విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాజకీయ పార్టీల నాయకులు, పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లందరూ ఉదయం 7 గంటల కల్లా కౌంటింగ్ సెంటర్ వద్దకు చేరుకోవాలన్నారు. వీరందరికీ ఐడీ కార్డులు జారీ చేశామని, వాటిని తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, కాబట్టి ఎవరూ సెల్‌ఫోన్లను కౌంటింగ్ సెంటర్‌కు తీసుకురావొద్దన్నారు. కౌంటింగ్ సమయంలో ఎవరూ కూడా ఉద్రేకానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, ఎలాంటి గొడవలకు పాల్పడినా పోలీసు కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు నిమిత్తం 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, మొత్తం 21 రౌండ్లలో లెక్కింపు జరుగుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్స్, హోమ్ ఓటింగ్ బ్యాలెట్స్ లెక్కింపు జరుగుతుందని చెప్పారు. ప్రజలెవరూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు రావొద్దని, వాటి వద్ద 144 సెక్షన్‌తో పాటు పోలీస్‌యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లో ఎవరికి కేటాయించిన టేబుల్ ఎదురుగా వారు కూర్చోవాలని, అటూ, ఇటూ కూడా తిరగడానికి వీల్లేదన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ జి. లక్ష్మయ్య, పలువురు తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గత నెల 31న సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి అన్‌రేటెడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో తమ అకాడమీ విద్యార్థి బట్ఫ్ అవినాష్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడని రామకృష్ణ చెస్ అకాడమీ కోచ్ అవ్వారు రామకృష్ణ తెలిపారు. అండర్–15 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో అవినాష్ 6/6 పాయింట్స్ సాధించి మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అవినాష్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. అవినాష్ ఇలానే మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

తాగునీటి శాంపిల్స్ సేకరణ



తాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): తాగునీటిలో ఎలాంటి కాలుష్యం లేదని ప్రజలకు భరోసా కల్పిస్తూ అధికారులు ప్రజల సమక్షంలోనే శాంపిల్స్ సేకరిస్తున్నారు. 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, రాధా నగర్‌లోని తాగునీటి ట్యాంక్‌ల పరిధిలో ఆదివారం విజయవాడ నగర పాలకసంస్థ తాగునీటి సరఫరా విభాగం డీఈ లక్ష్మీసిందూర, ఏఈ అరుణ్ కుమార్‌లు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రిపోర్టులో కాలుష్యం కాలేదని వచ్చిందన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, తాగునీటి వల్ల కాదన్నారు. వైద్య సిబ్బందితో ఇంటింటా సర్వే చేసినా ఎలాంటి డయేరియా కేసు నమోదు కాలేదన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పుస్తక పఠనం పెంపొందాలి



నూజివీడు శిబిరంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



తిరువూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తిరువూరు: విద్యార్థులు ప్రతిరోజూ పుస్తక పఠనం అలవరచుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని తిరువూరు శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. ఆదివారం తిరువూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో అన్ని సబ్జెక్టుల పుస్తకాలూ అందుబాటులో ఉన్నాయని, చారిత్రక పురుషులు, పురాణ ఇతిహాసాలు, విజ్ఞాన, వినోద కథల పుస్తకాలు చదివి మేథోవికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

- నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రంథాలయాధికారి డి.శ్రీనివాసరావు విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. నీతి కథల పుస్తకాలను చదివించి నీతి కథల నుంచి నేర్చుకునే అంశాలను వివరించారు. క్యారమ్స్, చెస్ ఆటలను ఆడించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసూతి, సంతాన సాఫల్య చికిత్సలపై సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ వెల్లంకి సుజాత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రసూతి, సంతాన సాఫల్య చికిత్సల్లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక వైద్య పరిజ్ఞానంపై నగరంలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, గైనకాలజీ సొసైటీ ఆఫ్ విజయవాడ, అను మై బేబీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో నిపుణులు అత్యంత క్లిష్టతరమైన ప్రసూతి కేసులు, పునరుత్పత్తి ఔషధ విభాగంలో విప్లవాత్మక ఆవిష్కరణలను వివరించారు. నూతన ఆవిష్కరణతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న తీరును వివరించారు. ఆధునిక ఔషధాల వినియోగం ద్వారా పునరుత్పత్తికి సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్, ఐఎంఏ విజయవాడ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చలసాని ప్రమోద్, డాక్టర్ అక్కినేని శివరామ్, ప్రసూతి వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, డాక్టర్ వెల్లంకి సుజాత, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభాదేవి, డాక్టర్ జి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.